


"శారదా; శారదా! లేవే! ఎప్పుడూ మొద్దునిద్రేనా? ఆడుకొనేందుకు సుశీలా, లలిత కూడా వచ్చారు, లేవవే!" అంటూ నిద్ర లేపుతున్న పుష్పను, కళ్ళు తెరిచి చూచింది, శారద.

"ఇది కలా, నిజమా?—అరే! పుష్పేమిటి! మాయింటికి వచ్చి నిద్రలేపటమేమిటి!! పండగ రోజేగా వాళ్ళమ్మా, మాఅమ్మా తగాదాపడ్డారు. శారదావాళ్లగడప త్రొక్కావంటే, నీ కాళ్ళిరగ కొట్తాను అని పుష్పను వాళ్లమ్మ హెచ్చరించిందే! ఆరోజు నుంచేగా నేనూ సుశీలా, లలితా ఆడుకొంటుంటే రెండు మూడు సార్లు మావద్దకు రాబోయి, వాళ్ళమ్మ కేకలతో ఏడుపు మొఖం పెట్టి దీనంగా మావంక చూస్తూ తిరిగి వెళ్ళి పోయింది పుష్ప-పాపం!

"అయినా పుష్పేం చేసింది? పెద్దవాళ్ళ తగాదాలకు పిల్లలం మేమేం చేస్తాము? మొన్న అంటే మొన్న ప్రొద్దున్నేగా-నేనూ లలిత అంతగా కొట్లాడుకొని మొఖమంతా గాట్లుపడేలాగిక్కున్నామే, తెల్లవారగనే మళ్ళీ కలిసి మెలసి ఆడుకోలేదూ! మరీ యీ పెద్దవాళ్ళు,

శ్రీ పేటేటి
నారాయణ లోకమాన్య

తగాదాలను తెంచకుండా పెంచుకుంటూ, అణగారిపోయిన వాటిని తిరిగి పైకితెచ్చి మళ్ళా రచ్చకెక్కుతుంటారు. అయినా మా అమ్మకు యింత పట్టుదల ఎందుకు? పుష్పా నేనూ ఆడుకుంటుంటే ఫెళ్ళున నా చెంపమీద కొట్టి రెక్క పట్టుకొని యింటికి యీడ్చుకొచ్చింది.

"పుష్ప తల్లి ఎంత మంచిది! మాతో మళ్ళీ ఆడుకునేందుకు వెళ్ళమ్మా అని చెప్పి పంపింది కాబోలు! నేను యింకా అనుమానంతో కళ్ళు నులుముకొంటూ చూచాను. పుష్పకే ఏ అనుమానమూ లేదు.

"పుష్పా మాయింటికి వచ్చావా? వస్తుంటే మీ అమ్మ కోప్పడలేదూ? కొంపతీసి నువ్వు మా అమ్మకి కన్పించలేదు కదా? ఇలారా కూర్చో, భయపడ్తా వెందుకు? అయితే నేనే వస్తానుండు" అంటూ పుష్పతో బయటకు నడచింది శారద.

"లలిత ఇంట్లో బొమ్మలుపెట్టి, పెళ్ళిళ్ళు చేద్దామనుకున్నామే. సుశీలను కూడా పిల్చాను. ఇప్పుడే అది, లలిత యింటికి వెళ్ళింది. నేను నిన్ను లేపుకొని బొమ్మలు, ఆటసామాగ్రి తీసుకు వెళ్దామని వచ్చాను. ఇదిగో, శారదా! యివ్వాళ ఆదివారంకూడా: కొండపల్లి బొమ్మలు కూడా తేవాలి. మర్చిపోకుండా పెందరాడే వస్తావు కదూ? బొమ్మలు మర్చిపోకేం?"



అంటూ చెంగు చెంగున లేడిలా పరిగెత్తుకు వెళ్ళింది పుష్ప.

శారద త్వరత్వరగా కాలకృత్యాలు ముగించి, కాఫీ త్రాగి, వాళ్ళమ్మకంట బడకుండా బొమ్మల బుట్ట చంకను పెట్టుకొని లలిత యింటికి జారుకుంది. లలిత యిల్లు పెద్ద మేడ. ఆమేడమీద మెట్ల దగ్గరగా ఒక చిన్నగది. ఆగదికిముందు ఒక వసారా. ఆవసారాలో ఆడుకునేందుకు నలుగురూ చేరారు.

లలిత, పుష్ప ఓజట్టు; శారద సుశీల ఓజట్టు. "ఈగది వాకిట దగ్గర మా యిల్లు, ఆ మెట్లకు ప్రక్కగా మీయిల్లు వుందనుకుందాం" అంది పుష్ప. 'సరే నన్నారు' మిగిలిన ముగ్గురు.

"అయితే వస్తువులు పంచండి" అంది లలిత. 'నేను పంచుతానుండండి' అంటూ శారద ముందుకు వచ్చింది.

"పక్షపాతం లేకుండా పంచాలి సుమా!" అందుకుంది లలిత.

"అది మా యిష్టము అన్ని బొమ్మలూ శారదవే కదటే? దాని యిష్టం వచ్చినట్టు పంచుతుంది" అంది సుశీల.

"అయితే మాత్రం; ఆటలో అవేమి పనికిరావు. ఆట కాగానే దాని బొమ్మలు దానికే యిచ్చేస్తాంగా" వెక్కించింది లలిత.

శారద అన్ని బొమ్మలూ పంచింది. కొండపల్లి బొమ్మలు మాత్రం పంచలేదు. తను వాటి నెంతో ప్రేమతో చూసుకొంటుంది. ఎవ్వరినీ ముట్టనివ్వక దాచుకొనేది. అందుకనే ఆబొమ్మలు తనొక్కతే వుంచుకొంది. లలిత, పుష్పా పేచీ పెట్టారు. "ఆ బొమ్మలు కూడా పంచకపోతే మేము ఆటకు రానే రాము" అని. ఇక తప్పని సరి అయింది-పంచక తప్పిందికాదు.

పుష్ప చేతులోనుంచి కొండపల్లి బొమ్మ క్రిందపడి విరిగిపోయింది. శారద చూచింది. కోపం పట్టలేక పుష్పనెత్తిన ఒక మొట్టు మొట్టింది. పుష్ప దీనంగా శారదవంక చూస్తూ "పొరపాటున జారిపడిందే. నిజంగా పడవెయ్యాలని పడవెయ్యలేదు" అని నర్ది చెప్పబోయింది.

శారదకు కోపం తగ్గలేదు, ఏమీ చెయ్యలేకపోగా, యిష్టమొచ్చినట్లు పుష్పను తిట్టిపోసింది. సుశీల లలిత కూడా పుష్పపక్షం వహించి శారదతో దెబ్బలాడబోయ్యారు. శారద ఏడుపు లంకించుకొని "మా అమ్మతో చెప్తానుండూ..." అంటూ యింటికి వెళ్ళటానికి మెట్లు దిగబోయింది.

పుష్ప శారదను బతిమాలాడుతూ ఆటకు రమ్మని చెయ్యి

(43-వ పేజీ చూడండి)

(37–వ పేజీ తరువాయి)

ఎందుకు విసిరారని అడిగితే 'మీకు సాక్ష్యమేం వుంది - చిన్న పిల్లలు కదా అని ఏమి చెయ్యాని మా మీదికి మీరంతా ఏకమయి వచ్చారందాము" అన్నాడు.

"మాకది బాగా నచ్చింది వెంటనే నాల్గురాళ్లు విసిరాము. అందులో ఒకటి ఎవరికో తగిలి నట్టుంది. ఆ యజమాను రాలు వాళ్ల బంట్రోతుల్ని పెద్దకొడుకుని (భర్త ఊళ్లో లేడు: - లేకపోతే ఆయన్నికూడా వుసికొల్పేదే) తీసుకు వచ్చింది. వీళ్లని చూస్తే మాకు భయం వేయలేదు కానీ, వెనకాల దుడ్డుకర్రతో నిలబడ్డ, (వీళ్లకుయిల్లు అద్దికిచ్చిన) ఆయన్ని చూడగనే మాత్రం మా వెంకటేశ్వర్లు, బతికుంటే తరువాతయినా అన్యాయాలను అరికట్టవచ్చను కున్నాడు గాబోలు, పరుగు పుచ్చుకున్నాడు. మేముకూడా మా సత్తువ కొద్దీ కాళ్లకు బుద్ధిచెప్పి పిక్కబలం చూపెట్టాము.

"పరిగెత్తుతున్న మాకు "ఈవీధికీసారి వస్తే నాకు చెప్పండి బడితపూజ చేస్తాను" అన్న ఆ యింటాయన మాటలు వినబడ్డాయి.

"అందుకే వెంకటేశ్వర్లు ఆ మేడను చూచి వణికాడు. వాళ్లిద్దరూ అప్పటికీ యిప్పటికీ ఆయింటి ముందర నుంచీ వెళ్తే ఆవంకర ముక్కు ఇంటాయన ఉన్నాడో లేదో చూచి, ఆయన గనుకవుంటే, వాయువేగ, మనో వేగాలతో వెనక్కి పరుగెత్తుతారు. ఆయినింట్లో లేకపోతే, ఎంతో గొప్పవాళ్లల్లాగా ఠీవిగా నడుస్తారు. వాళ్ల సంగతి అల్లా వుందా - నేను మాత్రం ఆయన బతికున్నంత కాలమూ ఆయింట వైపైనా వెళ్లలేదంటేనమ్మూ. పాపం- నెలరోజుల క్రితమే యింటాయన విష్ణులోకానికి పయనమయారు" అని ముగించాడు రత్నం.

ఈ రత్నం గాడి గొప్పతనం కూడా నిమిషంలో బయట పడింది. వాళ్లిద్దరూ ఆవీధిలోకి ఎప్పుడైనా వెళ్ళేవారు: వీడసలు ఆదిక్కైనా వెళ్లడు!

నేనింటికి వెళ్లి, వెంకటేశ్వర్లుతో, సందర్భము లేకుండానే, "మీకు సాక్ష్యం ఏది? మేం పిల్లలము కదాయని మీరంతా ఏకమయి వచ్చారు." అనగానే వాడు నన్ను వింతగ చూశాడు. తరువాత నేను "పాపం - ఆ పెద్దింటాయన విష్ణులోకానికి యాత్ర చేసాడని" చెప్పగానే, మా వాడి ముఖారవిందము వికసించి "నిజంగానా" అని అడిగాడు. నేను "అబద్ధమనుకున్నావా" అన్నాను.

ఇంతలో మా మావయ్య- అంటే వెంకటేశ్వర్లునాన్న- "ఏ పెద్ద మేడాయనరా?" అని అడిగారు. నేను సంగతంతా వివరించాను. ఇదంతా విని మా మావయ్య "ఇన్ని బుద్ధులు చెప్పే నువ్వే పారిపోయి వచ్చేవేరా, పిరికివాడా! మీావని, పిల్లిమెళ్లో గంట కట్టినట్లుంది" అన్నారు.

మావాడు నాకు బావ కనుక, వాణ్ణి నేను 'పిల్లిమెళ్లో గంటా' అని పిలిచేవాణ్ణి. అట్లా పిలిచినరోజున వాడు అన్నం తినేవాడు కాదు. వాడు మీకు కనబడితే మాత్రం వాణ్ణి అలా పిలవకండేం? ★

(35-వ పేజీ తరువాయి)

పట్టుకు లాగింది. శారద వెంకితనంగా పుష్ప చెయ్యి విదిలించబోయి కాలుజారి మెట్లమీాదనుంచి దొర్లుతూ క్రింద పడిపోయింది.

శారద తల్లి ఆదుర్దాగావచ్చి క్రింద పడివున్న శారదను లేపింది. శారద భయంతో లేచి చూచింది. తీరా చూస్తే తను వున్నది తన యింట్లోనే: లలితా వాళ్ల మేడలో కాదు! అయితే యిదంతా కల అన్నమాట!! "ఏమిటే, అంత గాబరాగా కేకలువేశావు? మంచం మీాద నుంచి క్రిందపడ్డావు. దెబ్బ లేమి తగల్లేదు కదా?" అంటూ శారదా వళ్లు తడుముతున్నది తల్లి. ఆమెకి జరిగినదంతా ఏమని చెప్తుంది- శారద మాత్రం!

★